క్లుప్తంగా

కడెం నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు

కడెం: ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు కడెం నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును సూపర్ లగ్జరీ సర్వీసుగా మార్చినట్లు నిర్మల్ డిపో మేనేజర్ ఎన్.సాయన్న ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగానే రోజు రాత్రి 8:30 గంటలకు కడెం నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి కడెంకు రాత్రి 10:15 గంటలకు బస్సు ఉంటుదన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ జయంతి



వేడుకలో పాల్గొన్న ఎస్సై విక్రమ్, నాయకులు

తానూరు: ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని ఎస్సై విక్రమ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి పంచరంగి జెండా ఆవిష్కరించారు. మారుతి, ఉపసర్పంచ్ సాయినాథ్, గంగాధర్, గణపతి, భారతీయ బౌద్ధమహాసభ నాయకులు పాల్గొన్నారు.

మే డే వారోత్సవాలు

ఖానాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు వీడకుంటే.. కార్మికులు ప్రభుత్వాలకు బుద్ధి చెబుతారని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్, జిల్లా సహాయ కార్యదర్శి సురేందర్ అన్నారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంతోపాటు మండలంలోని తర్లపాడ్, పాతఎల్లాపూర్ గ్రామాల్లో మే డే వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్వరూప, లక్ష్మి, గణేశ్, హైమద్, సంధ్య, రాధ, లింగన్న తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. తమ నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

హోంగార్డుల నిజాయతీ

భైంసాటౌన్: బాసర అమ్మవారి ఆలయంలో బ్యాగు పోగొట్టుకున్న ఓ భక్తురాలికి తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు ఆలయ హోంగార్డులు. హైదరాబాద్‌కు చెందిన సునీత దంపతులు ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చి ఆలయ ప్రాంగణంలో హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయారు. గమనించిన హోంగార్డులు శ్రీనివాస్, గోపాల్ ఆలయ అధికారులకు అప్పగించగా, వారు మైక్‌లో ప్రకటించి భక్తురాలికి అప్పగించారు. బ్యాగ్‌లో బంగారు కమ్మలు, ఫోన్, నగదు ఉండడంతో ఆమె సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఫోన్ అప్పగింత

నిర్మల్‌టౌన్: నిర్మల్ బస్టాండ్‌లో భైంసా పాయింట్ వద్ద యామిని అనే మహిళ ఫోన్ మర్చిపోయి వెళ్లారు. ప్లాట్ ఫాంలపై తిరుగుతున్న కంట్రోలర్ శ్యామ్‌కు ఫోన్ దొరకగా తన వద్ద భద్రపరిచాడు. బాధితురాలు ఫోన్ చేయడంతో బస్టాండ్‌లోనే ఫోన్ ఉందని వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. ఆదివారం అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్.. బస్టాండ్‌కు వచ్చిన యామినికి ఫోన్‌ను అందజేశారు.

మంత్రికి ఎమ్మెల్యే వినతి

భైంసాటౌన్: కుభీర్ మండలంలోని పార్డి(కె)లో రాజరాజేశ్వర ఆలయానికి కల్యాణ మండపం మంజూరు చేయాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం సచివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా మంత్రి ఛాంబర్‌లో వారిని కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

21 కిలోమీటర్ల రన్ చేసిన డాక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన న్యూరో వైద్యుడు డాక్టర్ బి.ఎల్ నరసింహారెడ్డి 21 కిలోమీటర్లు రన్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ చౌరస్తా నుంచి దిమ్మదుర్తి వరకు 21 కిలోమీటర్ల రన్‌ను రెండున్నర గంటల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. నిర్మల్ సైకిల్స్ క్లబ్ ఫౌండర్ సభ్యుడైన నరసింహారెడ్డి సైక్లింగ్, నడక, రన్నింగ్ అంశాల్లో యువతకు సందేశం ఇస్తుంటారు.

బీజేపీని బలోపేతం చేయండి

సారంగపూర్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వంజర్, ప్యారమూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. ఈసందర్భంగా వంజర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం గ్రామంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు పలు సూచనలు చేశారు. ప్యారమూర్ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో సాహెబ్‌రావు, చంద్రప్రకాశ్‌గౌడ్, రాంశంకర్‌రెడ్డి, విలాస్, రాజేశ్వర్, తిరుమల చారి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో కళకళ

- ఆహ్లాదం పంచుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు
- మొక్కల పెంపకంపై పెరుగుతున్న అవగాహన
- ప్రకృతివనాల్లో సేదతీరుతున్న ప్రజలు



కస్రాలో రోడ్డుకు ఇరువైపులా కనువిందు చేస్తున్న పచ్చదనం

కుభీర్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామాల్లో రోడ్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అధికారులు, పాలకులు ఎప్పటికప్పుడు సంరక్షణ చర్యలు చేపడుతుండటంతో పల్లెలు పచ్చనిహారంలా దర్శనమిస్తున్నాయి. మరోవైపు ప్రజలు సైతం తమ ఇళ్ల వద్ద నాటిన మొక్కలను సంరక్షిస్తున్నారు. కుభీర్ పోలీస్‌స్టేషన్ అలంకరణ మొక్కలతో నందనవనాన్ని తలపిస్తోంది. మాలేగాం, శివుని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నాటిన మొక్కలు ఆహ్లాదం పంచుతున్నాయి.

అడవులను తలపిస్తున్న ప్రకృతివనాలు..

మండలంలోని ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన అలంకరణ మొక్కలతోపాటు రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. శివుని, కస్రా, అంతర్ని, నిగ్వా, కుప్టి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు అడవులను తలపిస్తున్నాయి. ఎండల కారణంగా ప్రకృతివనాల్లో సేద తీరేవారి సంఖ్య పెరుగుతోంది.



సుందరంగా మాలేగాం పంచాయతీ కార్యాలయం



కస్రాలోని ప్రకృతి వనం



కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో అలంకరణ మొక్కలు

మన్‌కీబాత్‌తో ప్రజలతో మమేకం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్
- గ్రామాల్లో కార్యక్రమం వీక్షించిన బీజేపీ నాయకులు

కడెం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంతో దేశ ప్రజలతో మమేకమయ్యారని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని అంబారిపేట్ గ్రామ బూత్ అధ్యక్షుడు మహేశ్ ఇంట్లో బీజేపీ నాయకులతో కలిసి మన్‌కీబాత్ వీక్షించారు. మండలాధ్యక్షుడు కిష్టయ్య రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

భైంసాటౌన్: జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ ప్రసంగం వందో ఎపిసోడ్‌ను బీజేపీ నాయకులతోపాటు ప్రజలు వీక్షించారు. ఆదివారం ఆయా శక్తి కేంద్రాల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేసి ప్రధాని ప్రసంగం తిలకించారు.



కడెం: అంబారిపేట్‌లో వీక్షిస్తున్న రమేశ్, నేతలు

పట్టణంలోని 115, 116 బూత్‌లలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి మల్లేశ్వర్ ఆధ్వర్యంలో కార్యక్రమం వీక్షించారు.

కుభీర్: మండలంలోని జామ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, పార్డి(బి)లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, కుభీర్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగాశేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు మన్‌కీ బాత్ వీక్షించారు. డాక్టర్ పోశెట్టి, ఏశాల దత్తాత్రి, రావుల సంటి, నారాయణ్‌రెడ్డి, సంతోశ్ తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, వేరేశ్‌కుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు, ప్రజలు మన్ కీబాత్ కార్యక్రమం వీక్షించారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు టేకు ప్రకాష్, సంతోశ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలో మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్‌ను బీజేపీ నాయకులు రామారావ్ పవార్, కార్యకర్తలు తిలకించారు. శివాజీపటేల్, బాలాజీ పటేల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో మన్‌కీ బాత్ మోహన్‌రావుపటేల్ వీక్షించారు. పోతన్న, నరహరి, అనిల్‌పటేల్, సుభాష్‌పటేల్ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి జయంత్యుత్సవం



ముధోల్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు



సోన్ : సాకెర కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో ఆదివారం కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 108 రకాల నైవేద్యం సమర్పించారు.

ముధోల్: మండల కేంద్రంలోని ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పవార్ రామారావుపటేల్ పాల్గొన్నారు. కొండావార్ సంజీవ్, ఎర్రవార్ సంతోష్, రవీందర్, శంకర్, అశోక్, సతీశ్‌రెడ్డి, గడ్డం అనిల్ తదితరులున్నారు.

ఆరాధన దినోత్సవం..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, పంచాక్షరి మంత్రంతో మహాయజ్ఞం చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణాధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి నగునూరి బ్రహ్మయ్య, పూజారి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఇటీవల మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా బ్రహ్మణ చెరువు కట్ట ఎత్తు పెంచగా గ్రామస్తులు ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో మైసమ్మ విగ్రహాన్ని కట్టపై పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గజ్జలమ్మదేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకొని మొక్కు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకి సేవ నిర్వహించారు. కుంటాలకు చెందిన సుద్ధపు శివరాజ్ కోడెదూడను వదిలి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రశాంతంగా జ్యోతిబాపూలే ప్రవేశపరీక్ష

నిర్మల్‌రూరల్: జిల్లాలో జ్యోతిబాపూలే ఇంటర్మీడియెట్, డిగ్రీ కాలేజీలో ప్రవేశానికి ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. డిగ్రీ విద్యార్థుల కోసం రెండు సెంటర్లు, ఇంటర్మీడియెట్ ప్రవేశపరీక్ష కోసం 10 సెంటర్లను కేటాయించారు. ప్రవేశపరీక్ష ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగింది. ఇంటర్మీడియెట్‌లో మొత్తం 2,133 మంది విద్యార్థులకుగాను 1976 మంది పరీక్ష రాయగా 157 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీలో ప్రవేశం కోసం 239 మంది విద్యార్థులకు గాను 199 మంది హాజరవగా 40 మంది గైర్హాజరయ్యారు. అవకతవకలు జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



పరీక్ష కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ రాంబాబు

సెయింట్ థామస్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబు తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల సహాయ అధికారి పద్మ జిల్లా కేంద్రంలోని వాసవి ఉన్నత పాఠశాల, సెయింట్ థామస్ ఉన్నత పాఠశాల, చాణక్య పాఠశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

క్షీరాభిషేకం

నిర్మల్‌రూరల్: తెలంగాణలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తూ నూతన సచివాలయంలో తొలి సంతకం చేసిన సందర్భంగా అంబేద్కర్, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న 134 మంది కాంట్రాక్టు లెక్చరర్ల తరఫున సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు చెబుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్, విఠల్,



క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

జ్యోత్స్న, స్వప్న, పురుషోత్తం, భాస్కర్, రజనీకాంత్, రాజశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా పోరాడాలి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు రాజ్యాధికారం దిశగా ఐక్యంగా కలిసి పోరాడుదామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహాత్మా జ్యోతిబాపూలే ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ చౌటుపల్లి సురేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మయూరి ఇన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్ముల అశోక్, రవికాంత్, రాజు, సిలారి వెంకటరమణ, రమేశ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో

ఖానాపూర్: రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డు చౌరస్తాలో రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో ధాన్యం తడిసి పోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు. నాయకులు షబ్బీర్‌పాషా, తోట సత్యం, జంగిలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం యంగ్ ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో జి ల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. సభ్యులు నాని, సునీల్, సంతోష్, ఉదయ్, వినీత్, సందీప్, వంశీ, యోగేశ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వృథాగా భగీరథ జలం



లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీరంతా వృథాగా సమీపంలోని రైతుల చేన్లలోకి వెళ్తుండటంతో దుక్కులు నానుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే భగీరథ నీటి లీకేజీని అరికట్టాలని చింతల్‌చాంద రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: క్రాంతి, ఏఈ, మిషన్ భగీరథ, ఫోన్: 90005 79800

ముగిసిన ఎంసెట్ శిక్షణ శిబిరం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ బాలికల జూనియర్ కళాశాలలో నెలరోజుల నుంచి కొనసాగుతున్న ఉచిత ఎంసెట్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్ మాట్లాడారు. నిర్మల్, పోచంపాడ్, బోధన్ కళాశాలలో చదువుకున్న 200 మంది విద్యార్థినులకు నెల రోజులపాటు ఉచిత శిక్షణ అందించామన్నారు. గ్రాండ్ టెస్టులు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఇందులో విద్యా కమిటీ చైర్మన్ రామేశ్వర్,



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు వేణుగోపాల్, నవీన్, వెంకట్, మహేశ్, దీపక్, వేణు, రోహిణి, రజని పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించి మద్దతు ధర పొందాలని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మోర, గడ్‌చాంద గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాజేశ్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. భైంసా మార్కెట్ తరఫున మండలంలో అభివృద్ధి పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నారాయణ్‌రెడ్డి, సర్పంచ్ శారద, పంచగుడి సర్పంచ్ ఎల్లన్న, లక్ష్మణ్‌రావు, చిన్నారావు, రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ కమిటీ మండల కన్వీనర్ శ్యాంసుందర్, భోజారెడ్డి, శ్రీనివాస్‌రావు, రమేశ్‌గౌడ్, మోహన్ పాల్గొన్నారు.



ధర్మోరలో కేంద్రం ప్రారంభిస్తున్న రాజేశ్‌బాబు

మేరు సంఘం సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మణచాంద: మేరు సంఘం సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మేరు సంఘం సమస్యలను రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవించుకుందామన్నారు. దీనికి మండలాల అధ్యక్షులు, సభ్యులు రావాలని ఆయన కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు నరేందర్, మండలాధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు రఘు, రాజు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ జిల్లా కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో సోమవంశీయ సహస్రర్జున క్షత్రియ సమాజ్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు గుజరాతి వినోద్, ధోండి నవీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా పితాంబర్ చావల, ఉపాధ్యక్షులుగా గరడి కిశోర్, ధోండి నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గుజరాతి నాగేశ్వర్, కోశాధికారిగా ధోండి సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా బారడ్ రాజ్‌కుమార్‌తో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామ బడుగు, బలహీనవర్గాల కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బడుగు వర్గానికి చెందిన గోనుగొప్పుల రవిని గ్రామాధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా ముక్కెర రవికుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు ఉన్నారు.

నియామకం

కుంటాల: బీజేవైఎం మండల అధ్యక్షునిగా అంబకంటి గ్రామానికి చెందిన ముత్తేశ్, ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్లుగా పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ సాయినాథ్‌ను నియమించారు. ఆదివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అరుణ్, జిల్లా ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ రాథోడ్ అర్జున్ సమక్షంలో వీరిని నియమించారు.

అంబలి పంపిణీ పరిశీలన

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌తో పాటు మండల కేంద్రంలో నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న అంబలి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సదర్మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు హపవత్ రాజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంపిణీ కేంద్రాన్ని సందర్శించి సర్పంచ్‌ను అభినందించారు.

ఈరోజు

సమ్మర్‌క్యాంప్ ప్రారంభం

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల, బుట్టపూర్ ప్రాథమిక పాఠశాలల్లో ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంఈవో మధుసూదనచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ఆటలు, తొమ్మిది గంటల నుంచి 10 వరకు చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెంబి మండలంలో..

పెంబి: మండల కేంద్రంతోపాటు మందపల్లి, ఇటిక్యాల్, లోతర్య, రాయదారి, తాటిగూడ, కర్ణంలొద్ది గ్రామాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నేటి నుంచి నెల రోజులపాటు నిత్యం ఉదయం ఆటలు నిర్వహిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో రత్నాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్: మండలంలోని బిద్రెల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని.. డైరెక్టర్లు, గ్రామాల సర్పంచ్‌లు సకాలంలో రావాలని వారు కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుభీర్: మండలంలోని పార్డి(బి), సోనారి, కుభీర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అజీజొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.